ఐక్యంగా పనిచేద్దాం..పార్టీని గెలిపించుకుందాం

- ఎల్లో మీడియా దుష్ప్రచారాన్ని తిప్పికొడదాం
- కార్పొరేటర్ల సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు సిత్రా సత్యనారాయణమ్మ



నగరపాలక కార్పొరేటర్లతో సమావేశమైన పార్టీ జిల్లా అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ. చిత్రంలో వైఎస్సార్‌సీపీ కర్నూలు ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య

కర్నూలు (టౌన్): 'ఎన్నికల సమయం దగ్గర పడుతుంది. ఐక్యంగా పనిచేసి పార్టీ అభ్యర్థులను గెలిపించుకుందా'మని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు సిత్రా సత్యనారాయణమ్మ కార్పొరేటర్లకు పిలుపు నిచ్చారు. కర్నూలు ఎంపీ, కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకుందామన్నారు. గురువారం స్థానిక బిర్లా కాంపౌండ్‌లోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో కర్నూలు నగర కార్పొరేటర్లతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కర్నూలు పార్లమెంటు అభ్యర్థి బీవై రామయ్య పాల్గొన్నారు. ముందుగా పార్టీ జిల్లా అధ్యక్షురాలు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మీద ప్రజలకు నమ్మకం ఉందన్నారు. వివిధ పథకాల ద్వారా ప్రతి ఇంటికీ సంక్షేమం, అభివృద్ధిని అందించడం ద్వారా వైఎస్ జగన్‌ను మరోసారి గెలిపించేందుకు వారు సిద్ధంగా ఉన్నారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో రూ.కోట్లు ఖర్చు చేసి ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. చేసిన పనులు, ప్రగతిని ప్రజలకు వివరించి ఫ్యాన్‌గుర్తుకు ఓటు వేసేలా కార్పొరేటర్లు చూడాలన్నారు. అలాగే ఎల్లోమీడియ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. కర్నూలు పార్లమెంటు అభ్యర్థి బీవై రామయ్య మాట్లాడుతూ ఇప్పటికే జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన తాను మూడేళ్లుగా మేయర్‌గా పనిచేస్తున్నట్లు చెప్పారు. ఈ పాలన కాలంలో జరిగిన అభివృద్ధిని గమనించాలన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వానికి ఇప్పటి వైఎస్సాఆర్‌సీపీ ప్రభుత్వానికి మధ్య గల తేడాను కర్నూలు ప్రజలు గుర్తించారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా స్థానిక సమస్యలు పరిష్కరించినట్లు చెప్పారు. సమర్థవంతంగా పని చేసినందుకు పార్టీ తనకు ప్రమోషన్ ఇచ్చి కర్నూలు పార్లమెంటు అభ్యర్థిగా నిలబెట్టిందన్నారు. 2019 ఎన్నికల్లోనూ కర్నూలు టఫ్‌గా ఉందని ఎంతో ప్రచారం జరిగిందన్నారు. చివరకు వైఎస్సార్‌సీపీనే గెలిచిందన్నారు. ఇప్పుడు సైతం ప్రత్యర్థి ఆర్థికంగా ధనవంతుడు కాబట్టి ఎల్లో మీడియా ద్వారా లేనిపోని వదంతులు సృష్టిస్తున్నారన్నారు. దీనిని ప్రజలు నమ్మరన్నారు. ఎన్నికల్లో బ్రహ్మాండమైన విజయంతో మనం గెలవబోతున్నామన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు గుర్తింపుతో పాటు అవకాశాలు లభిస్తాయన్నారు. సమావేశంలో కర్నూలు నగర కార్పొరేటర్లు మాట్లాడుతూ అభ్యర్థుల విజయానికి చిత్తశుద్ధితో పనిచేస్తామన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గద్దం రామక్రిష్ణ, నగర కార్పొరేటర్లు పాల్గొన్నారు.

వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలి

కర్నూలు కల్చరల్: విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని చిన్మయ మిషన్ బాధ్యులు స్వామిని సుప్రేమానంద అన్నారు. వీఆర్ కాలనీలోని చిన్మయ మిషన్‌లో గురువారం వేసవి శిక్షణ శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికి తీసేందుకు వేసవి శిక్షణ శిబిరాలు ఉపయోగ పడతాయన్నారు. దేశ భక్తి గీతాలు, సర్వదేవతల శ్లోకాలు, సూర్య నమస్కారాలు, భగవద్గీత శ్లోకాలు, నీతి కథలు తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నారన్నారు.

☛ శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నెహ్రూనగర్‌లోని సత్యసాయి మందిరంలో గురువారం ఉచిత వేసవి శిక్షణ శిబిరం ప్రారంభమైంది. ఈ సందర్భంగా సేవా సమితి జిల్లా అధ్యక్షుడు మాకా అశోక్‌కుమార్ మాట్లాడుతూ రోజువారి జీవితంలో ఉపయోగ పడు శ్లోకాలు, ప్రార్థనలు, పిల్లల్లో మానవతా విలువలు పెంపొందించడానికి అవసరమైన కథలు, భారతీ సంస్కృతికి సంబంధించిన ప్రాథమిక వివరణ, పిల్లల్లో దాగి ఉన్న నైపుణ్యాలను పెంపొందించే కార్యక్రమాలు, శారీరక వికాసానికి అవసరమైన ఆటలు, ధ్యానం, యోగ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు.

క్లుప్తంగా

28 నుంచి ఇస్కాన్‌లో ప్రహ్లాద బడి వేసవి శిబిరం

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని పూరి జగన్నాథ మందిరంలో ఈనెల 28 నుంచి ప్రహ్లాద బడి వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక దాస్ తెలిపారు. మృదంగం, చిత్రలేఖనం, కరతాళాలు, భగవద్గీత శ్లోకాలు, అన్నమయ్య కీర్తనలు, హరి నామ జపం అంశాల్లో శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. మే 18వ తేదీ వరకు ప్రతి రోజు సాయంత్రం 4.30 నుంచి 6.30 గంటల వరకు తరగతులు జరుగుతాయని తెలిపారు. వివరాలకు 95053 77520, 99891 47723 నంబర్లను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధుల నివారణ

కర్నూలు(హాస్పిటల్): పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులను నివారించవచ్చని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఓల్డ్ లెక్చర్ గ్యాలరీలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్ణయం మేరకు 2007 నుంచి ప్రతి సంవత్సరం ఏప్రిల్ 25న ప్రపంచ మలేరియా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరం మరింత సమానమైన ప్రపంచం కోసం మలేరియాపై పోరాటాన్ని వేగవంతం చేయడం అనే నినాదంతో ప్రజలను చైతన్యపరుస్తూ భాగస్వాములను చేయాలని పిలుపునిచ్చారు. దోమల జీవితచరిత్ర, ఉత్పత్తి స్థానాలు, మలేరియా వ్యాధి లక్షణాలు, చికిత్స, నివారణ చర్యల గురించి వివరించారు. దోమలు పుట్టకూడదు–దోమలు కుట్టకూడదు అనే నానుడితో జిల్లాలో ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడేను సమర్థవంతంగా నిర్వహిస్తూ దోమల ఉత్పత్తి స్థానాలను నిర్మూలించే ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలని, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ విజయానందబాబు, డీఎల్ఏటీవో డాక్టర్ భాస్కర్, డీఎంవో నూకరాజు, కర్నూలు మెడికల్ కాలేజీ కమ్యూనిటీ మెడిసిన్ విభాగం నుంచి డాక్టర్ స్వర్ణకుమారి, డాక్టర్ వైష్ణవి, డెమో ప్రమీలాదేవి, బయాలజిస్టు వెంకటేశ్వర్లు, ఏఎంఓ చంద్రశేఖర్, ఎస్‌ఓ హేమసుందరం, హెచ్‌ఈఓ శ్రీనివాసులు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల పరిశీలకుల రాక



ఎన్నికల పరిశీలకులకు బొకే అందజేస్తున్న రిటర్నింగ్ అధికారి భార్గవతేజ

కర్నూలు (టౌన్): కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల ఎన్నికల పరిశీలకులు పీసీ జాఫర్, అలాగే పత్తికొండ, ఆదోని, ఆలూరు నియోజకవర్గాలకు సంబంధించి మీర్ తారీఖ్ అలీ గురువారం కర్నూలు ప్రభుత్వ అతిథి గృహానికి చేరుకున్నారు. కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి భార్గవతేజ ఎన్నికల పరిశీలకులను కలిసి బొకే అందజేశారు.

వాహనాల వేలంలో రూ.33 వేల ఆదాయం

కోడుమూరు రూరల్: కోడుమూరు సెబ్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన 8 ద్విచక్రవాహనాలకు గురువారం వేలం పాట నిర్వహించారు. జీఎస్టీతో కలుపుకుని రూ.33,158 ఆదాయం వచ్చినట్లు సెబ్ సీఐ రామాంజినేయులు తెలిపారు. అలాగే 17 కేసుల్లో సీజ్ చేసిన ఇతర రాష్ట్రాలకు చెందిన 142 లీటర్ల మద్యం, 18 కేసుల్లో సీజ్ అయిన ఏపీకి చెందిన 39.78 లీటర్ల మద్యం, 13కేసుల్లో సీజ్ చేసిన సారాను ధ్వంసం చేసినట్లు వెల్లడించారు.

టీడీపీ కార్యకర్తపై కేసు నమోదు

పాణ్యం: మండల పరిధిలోని ఆలమూరు గ్రామంలో అనుమతి లేకుండా ఇంటిపై పార్టీ జెండా కట్టిన టీడీపీ కార్యకర్త అల్లాడి ప్రవీణ్ కృష్ణపై ఎన్నికల నిబంధన ఉల్లంఘన కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అశోక్ తెలిపారు. బుధవారం సాయంత్రం కొందరు వీడియో తీసి సీవిజిల్ యాప్‌లో ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ ఫనికుమార్, ఎంసీసీ ఇన్‌చార్జి భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

గడ్డివామి దగ్ధం

గూడూరు రూరల్: మండల పరిధిలోని పెంచికలపాడులో గురువారం రైతు పెద్ద గోరంట్లకు చెందిన గడ్డివామి ప్రమాదవశాత్తు అంటుకుంది. మంటలు వ్యాపించడాన్ని గమనించిన స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఆర్పేందుకు యత్నించినా ఫలితం లేకుండా పోయింది. అగ్నిమాపక సిబ్బంది వచ్చేలోగా గడ్డివామి పూర్తిగా కలిపోయింది. సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లిందని.. నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు పెద్ద గోరంట్ల కోరాడు.

న్యాయరాజధాని వైఎస్సార్‌సీపీతోనే సాకారం



9వ వార్డు శంకర్ మిఠాయి వీధిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్

- ఎన్నికల ప్రచారంలో కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్



ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్‌పర్సన్ విజయ మనోహరి

కర్నూలు (టౌన్) : మనకు న్యాయ రాజధాని రావాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని ఆ పార్టీ కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్ అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక 9వ వార్డు పరిధిలోని శంకర్ మిఠాయి వీధిలో మాజీ ఎమ్మెల్యే, కర్నూలు పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ ఎస్వీ మోహన్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ టి.పుల్లమ్మ, స్థానిక నాయకులు నవీన్ ఆధ్వర్యంలో ఇంటింటికీ ఇంతియాజ్ పేరుతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఆయన ఓట్లు అభ్యర్థించారు. ప్రతి ఒక్కరితో మాట్లాడి జగనన్న చేసిన సంక్షేమ ఫలాలను తెలియజేస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి మాట్లాడుతూ అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందినప్పుడే మన రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందన్నారు. ఇందుకోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కర్నూలుకు న్యాయ రాజధానిని ప్రకటించారని గుర్తు చేశారు. కొంతమంది అడ్డంకులు సృష్టించడం వల్ల జాప్యం జరిగిందని, అయితే ఇప్పటికే న్యాయ రాజధాని ఏర్పాటు దిశగా అడుగులు ముమ్మరంగా సాగాయన్నారు. కర్నూలు మాజీ ఎమ్మెల్యే, కర్నూలు పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కర్నూలు అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఇంతియాజ్ సౌమ్యుడు, ఉన్నత విద్య అభ్యసించాడని, అటువంటి వ్యక్తిని గెలిపించుకోవడం ద్వారా కర్నూలు మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.అలాగే ఉపాధి అవకాశాలు సాధించుకోవచ్చన్నారు. ముచ్చటగా మూడోసారి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవాలని కోరారు.

43వ వార్డులో ఎన్నికల ప్రచారం

వైఎస్సార్‌సీపీ కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్, కర్నూలు పార్లమెంట్ అభ్యర్థి బీవై రామయ్యను గెలిపించాలని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్‌పర్సన్ విజయ మనోహరి అభ్యర్థించారు. గురువారం సాయంత్రం వార్డు పరిధిలోని ఇందిరాగాంధీ నగర్ వీధిలో ఆమె కార్పొరేటర్ కురువ మునెమ్మ, స్థానిక నాయకులు మల్లికార్జునతో కలసి విస్తృతంగా పర్యటించారు. జగనన్న సంక్షేమ పథకాల వివరాలతో కూడిన కరపత్రాలను ఇంటింటికీ అందజేశారు. అనంతరం విజయ మనోహరి మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వం మహిళలకు ఒక్కటంటే ఒక్క మంచి పథకాన్ని అమలు చేయలేదని విమర్శించారు. జగనన్న ప్రభుత్వం ప్రతి పథకంలో మహిళలకు ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. ఎక్కడా అవినీతి లేకుండా, లంచాలు లేకుండా నేరుగా మహిళల అకౌంట్లలో డబ్బులు జమ చేసి వారిని ఆర్థికంగా ఆదుకుందన్నారు. కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు చంద్రశేఖర్, మహిళలు పాల్గొన్నారు.

ఎన్ని కూటములొచ్చినా మళ్లీ జగనే సీఎం



వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- కల్లూరు అర్బన్‌లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం

కల్లూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎన్ని పార్టీలు జత కట్టి వచ్చినా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌కు మరోసారి ముఖ్యమంత్రి కావడం తథ్యమని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం కల్లూరు అర్బన్ 19వ వార్డులో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలను మోసం చేసేందుకు చంద్రబాబు కూటమి కట్టారన్నారు. 2014లో 600పైగా హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా మోసం చేసిన విషయాన్ని ప్రజలు మరిచిపోలేదన్నారు.అందుకే బాబుకు 2019 ఎన్నికల్లో ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారన్నారు. నవరత్నాల పథకాలతో పేదల జీవితాలు బాగుపడ్డాయన్నారు. సంక్షేమ పథకాల ఎంపికల్లో అర్హతే ప్రామాణికంగా తీసుకుని కులమతాలు, రాజకీయాలు, వర్గాలు, పార్టీలు చూడకుండా అర్హులైన వారందరికీ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. గత టీడీపీ పాలనలో పేదలకు ప్రభుత్వ పథకాలు పొందాలంటే జన్మభూమి కమిటీ సిఫారసులతో పాటు నాయకుల అండదండలు ఉండాలన్నారు. టీడీపీకి ఓటేస్తే మళ్లీ 2014 పరిస్థితే పునరావృతమవుతందని చెప్పారు. జగనన్న సంక్షేమ పాలన కొనసాగాలంటే మరోసారి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పాణ్యం ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు గోపాల్‌రెడ్డి, భీమా శంకర్‌రెడ్డి, రంగారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, బాలచంద్రారెడ్డి, సుకుమార్, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి, వార్డు నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

జగనన్న పాలన.. సంక్షేమానికి చిరునామా

ఓర్వకల్లు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమ పాలన, అభివృద్ధి సాధ్యమని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సతీమణి ఉమామహేశ్వరమ్మ అన్నారు. గురువారం మండలంలోని గుడుంబాయి తండా, కాల్వబుగ్గ, కాల్వ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇప్పుడు అమలు అవుతున్న సంక్షేమ పథకాలతో పాటు మరింత మేలు జరగాలంటే మరోసారి జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు పోచా బ్రహ్మానందరెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

జేఈఈలో కార్పొరేట్ కాలేజీల హవా



అత్యుత్తమ పర్సెంటైల్ సాధించిన విద్యార్థులతో నారాయణ కళాశాల అధ్యాపక బృందం



ఉత్తమ పర్సెంటైల్ సాధించిన విద్యార్థులతో చైతన్య కళాశాల అధ్యాపక బృందం



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఎస్ఆర్ రెసిడెన్షియల్ కాలేజ్ జోనల్ ఇన్‌చార్జ్ రఘువీర్, తదితరులు

కర్నూలు సిటీ: జేఈఈ మెయిన్స్ పరీక్షలో పలు కార్పొరేట్ కాలేజీలు సత్తాచాటాయి. ఈ పరీక్ష ఫలితాలను బుధవారం రాత్రి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రకటించింది. ఈ పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఆయా కాలేజీల నిర్వాహకులు గురువారం ప్రత్యేకంగా అభినందించారు. నారాయణ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ పర్సెంటైల్ సాధించినట్లు డీజీఎం గోవర్ధన్‌రెడ్డి, డీన్‌లు ఆంజనేయరెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, నరసింహారావు తెలిపారు. షాహిద్ అలీఖాన్ 99.93 పర్సెంటైల్‌తో ఇల్ ఇండియా లెవెల్‌లో 1224వ ర్యాంకు,బి.వేదవ్యాస్ 99.92 పర్సెంటైల్‌తో 1441వ ర్యాంకు, పి.సాకేత్ సాయి మణికంఠ 99.71 పర్సెంటైల్‌తో 4,652వ ర్యాంకు, ఎస్.సాకేత్ రామ్ 99.62 పర్సెంటైల్‌తో 6,231వ ర్యాంకు, ఆర్.సాయి అభినయ్ 99.49 పర్సెంటైల్‌తో 8,219వ ర్యాంకు, ఎం.లాస్య 98.54 పర్సెంటైల్‌తో 10,731వ ర్యాంకు, జి.సర్వజిత్ 99.31 పర్సెంటైల్‌తో 10,970 ర్యాంకు సాధించారన్నారు. వీరితో పాటు ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరీలో 5 వేలలోపు 3, 10 వేలలోపు 5 మంది, 20 వేలలోపు 11 మంది, 30 వేలలోపు 15 మంది, 40 వేలలోపు 20, 50వేలలోపు 26 మంది, 60 వేలలోపు 33 మంది విద్యార్థులకు ర్యాంకులు వచ్చాయన్నారు.

☛ **శ్రీచైతన్య కళాశాల ..** జేఈఈ మెయిన్స్ మొదటి సెషన్ ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ప ర్సెంటైల్ సాధించారని ఆ విద్యాసంస్థల ఏజీఎం మురళీకృష్ణ, డీన్‌లు సరళ, బాలాజీ పేర్కొన్నారు. కాలేజీలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో వారు పాల్గొని ప్రసంగించారు. ఆల్ ఇండియా లెవెల్‌లో హర్షవర్ధన్ 180వ ర్యాంకు, ఎస్.యోగీశ్వర్ 308వ ర్యాంకు, డి.నోయల్ తనయ్ 399వ ర్యాంకు, పి.ప్రణీత్ రెడ్డి 486వ ర్యాంకులతో పాటు ప్రతాప్ ఉమా లీకేష్ 98.75, ఇర్విని కీర్తి కీర్తన్ 98.65 అత్యుత్తమ పర్సెంటైల్‌తో ర్యాంకులు సాధించారన్నారు.

☛**ఎస్ఆర్ విద్యాసంస్థలు...** తమ విద్యార్థులు అత్యుత్తమ పర్సెంటైల్‌తో జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించారని ఆ విద్యా సంస్థలకు చెందిన జోనల్ ఇన్‌చార్జ్ టి.రఘువీర్ తెలిపారు. కాలేజీలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కె.ప్రశాంత్ రెడ్డి ఆల్ ఇండియా కేటగిరీలో 148వ ర్యాంకు, ఎం.ముల్లా నాయక్ 1,580వ ర్యాంకు, వేదవచన్ రెడ్డి 1,647వ ర్యాంకు, సూరపురెడ్డి భద్రీనాథ్ రెడ్డి 4,476వ ర్యాంకు, శివమణి 5,954వ ర్యాంకు, ఎం.చరణ్‌తేజ 8,618, బి.సాయి సృజన్ 9,218వ ర్యాంకు, వై.మినిత్‌కుమార్ 16,858, ఎస్.కార్తీకేయ మూర్తి 17,320, కె.జయరంగారెడ్డి 19,002వ ర్యాంకు సాధించినట్లు ఆయన వెల్లడించారు

ముగిసిన నామినేషన్ల పర్వం

- చివరి రోజుతో కలిపి కర్నూలు అసెంబ్లీకి మొత్తం 56 నామినేషన్ల దాఖలు
- నేడు నామినేషన్ల పరిశీలన



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్ సతీమణి అల్లగుండు సమీనా ఇంతియాజ్

కర్నూలు (టౌన్) : ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఈనెల 18 నుంచి ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ గురువారం మధ్యాహ్నం 3 గంటలకు ముగిసింది. చివరి రోజు 21 నామినేషన్లు దాఖలయ్యాయి. స్థానిక నగరపాలక కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ వాటిని స్వీకరించారు. కాంగ్రెస్‌పార్టీ నుంచి జిలానీ 4 సెట్లు, తెలుగుదేశం పార్టీ నుంచి 2 సెట్లు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్లు దాఖలు పరిచిన వారిలో మహమ్మద్ పాషా (ఇండిపెండెంట్, అరోరానగర్), టీజీ భరత్ (టీడీపీ, సంకల్‌బాగ్), బొల్లెద్దుల ప్రసాదరావు (ఇండిపెండెంట్, సాయిబాబానగర్), బండారి మురళీ బాబు (ఇండిపెండెంట్, బాపూజీనగర్), గంధం సజీవ్‌కుమార్ (ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్, బి. క్యాంపు), ఎండీ ఇంతియాజ్ బాషా (ఇండిపెండెంట్, ఖల్లా వీధి), మాలవకటి మీనాక్షి (ఇండిపెండెంట్, బంగారుపేట), గౌతం క్రిష్ణ అయ్యంగార్ (సమాజ్‌వాదీ పార్టీ, వీకర్ సెక్షన్ కాలనీ), వకీల్ అహమ్మద్ (సోషల్ డెమాక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా, గనీగల్లీ), షేక్ జిలానీ బాషా (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌పార్టీ, కల్లూరు), బన్నూర్ చంద్రశేఖర్‌రెడ్డి (ఇండిపెండెంట్, నాయిడు అపార్టుమెంట్), బడాయి ఫాసిహా నాజ్ (ఇండిపెండెంట్, పార్కు రోడ్డు), గిరిపోగు అరుణాకుమార్ (బహుజన్ సమాజ్‌పార్టీ, శ్రీనివాసనగర్), షేక్ మహమ్మద్ మహబూబ్ (ఇండిపెండెంట్, కొత్తపేట), అల్లగుండు సమీనా ఇంతియాజ్ (ఇండిపెండెంట్, ఎస్‌ఆర్ పేట), కురువ నగేష్ (ఇండిపెండెంట్, మరాఠి) ఉన్నారు. కాగా కర్నూలు అసెంబ్లీకి ఈనెల 18 నుంచి ఇప్పటి వరకు మొత్తం 56 నామినేషన్లు దాఖలైనట్లు ఆర్‌ఓ వెల్లడించారు.

నేడు నామినేషన్ల పరిశీలన

ఎన్నికల షెడ్యూల్ ప్రకారం నామినేషన్ల స్వీకరణ గడువు ముగియడంతో నేడు వాటి పరిశీలన జరుగనుంది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల పరిశీలన ఉంటుందని కర్నూలు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ స్పష్టం చేశారు. ఈనెల 29వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉందని చెప్పారు.

కల్లూరులో సీపీఎం ప్రచారం

కల్లూరు: ప్రజా సమస్యలు పట్టించుకోని పార్టీలకు ఓటు అడిగే హక్కు లేదని సీపీఎం పాణ్యం అభ్యర్థి డి.గౌస్ దేశాయ్ అన్నారు. గురువారం కల్లూరు అర్బన్ 37వ వార్డు వీకర్‌సెక్షన్ కాలనీ, సూర్యనారాయణ నగర్, సదాశివనగర్, నేతాజీ హౌసింగ్ కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కల్లూరు కాలనీల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. తనను గెలిపిస్తే సమస్యలను పరిష్కరిస్తానన్నారు.

హుండీ కానుకల లెక్కింపు

హొళగుంద: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఎల్లార్తి శేక్షావలి, షాషావలి దర్గాల హుండీ కానుకల లెక్కింపును గురువారం ప్రాంభించారు. విజయవాడ నుంచి వచ్చిన ఈఓ అబ్దుల్ ఖుద్దూస్, సూపరిటెండెంట్ షేక్ హైరాన్ బాషాల ఆధ్వర్యంలో కానుకల లెక్కిపు ప్రారంభించారు. కాగా దర్గాల అభివృద్ధిపై గ్రామానికి చెందిన పెద్దలు రాజశేఖర్ రెడ్డి, వైకుంఠం, సర్దార్, రంగస్వామి, మల్లి తదితరులు వక్ఫ్‌బోర్డ్ అధికారును నిలదీశారు. 2014 నుంచి దర్గాలు వక్ఫ్‌బోర్డు ఆధీనంలోకి వెళ్లినప్పటి నుంచి ఇప్పటి వరకు రూ.కోట్లలో ఆదాయం వస్తున్నా ఎందుకు అభివృద్ధి చేయలేదని ప్రశ్నించారు. తరచూ కానుకల లెక్కింపు సమయంలో వచ్చి మొత్తం మూటకట్టుకుని వెళ్లడమే తప్ప గ్రామంలోని దర్గాల అభివృద్ధికి ఖర్చు చేసిన దాఖలాలు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని వక్ఫ్‌బోర్డ్ అధికారులు సర్ది చెప్పి కానుకల లెక్కింపును ప్రారంభించారు. లెక్కింపు పూర్తి కాకపోవడంతో ఆదాయం ఎంత వచ్చిందనేది తెలియరాలేదు.

ఎల్లార్తి దర్గాకు పోటెత్తిన భక్తులు

ఎల్లార్తి గ్రామంలో వెలిసి శేక్షావలి, షాషావలి దర్గాలను గురువారం భక్తులు దర్శించుకుని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. జిల్లా నుంచే కాకుండా కర్ణాటక, తెలంగాణ తదితర దూర ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు.